చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.133	193	219
సూర్యాపేట	రూ.120	175	200
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 కనిష్ఠం 20.8

అనుభవమా? రాజకీయ జోక్యమా?

▸ డీసీసీబీ సీఈవో ఎంపికపై చర్చోపచర్చలు ▸ రిటైర్డ్ బ్యాంకు మేనేజర్‌ను ఫైనల్ చేసిన నాబార్డు ▸ నేడు జరిగే ఎంసీ మీటింగ్‌లో తుది నిర్ణయం



నల్లగొండ, ఫిబ్రవరి 4: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈవో ఎంపికపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత సీఈవో మదన్‌మోహన్ అనారోగ్య కారణాలతో సెలవులపై వెళ్లారు. ఆయన పదవీ కాలం దాదాపు ముగిసే సమయంలో ఆయన సెలవులు పెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార కేంద్రం పాలకవర్గం నివేదిక మేరకు కొత్త సీఈవో కోసం రాష్ట్ర అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ మేరకు గత నెల మూడో వారంలో ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. సుమారు 14మంది సీనియర్లు సీఈవో పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా అనుభవంతో పాటు సీనియారిటీని చూసి ఎంపిక చేయాలనే నిబంధన ఉండటంతో ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారనేది ఆసక్తిగా మారింది.

డీసీసీబీ సీఈవో ఎంపికలో మెరిట్ ప్రాతిపదికన మార్కులు వేశారా? లేక రాజకీయ జోక్యంతో ఎంపిక చేశారా? అనేది ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో హాట్ టాపిక్‌గా మారింది. ఎంతోమంది ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతూ సీనియర్లుగా ఉన్నా, పదవీ విరమణ పొందిన వ్యక్తికి ఎలా బాధ్యతలు ఇస్తారనే దానిపై పలువురు అసంతృప్తితో ఉన్నట్లు వినికిడి. ఈ ఎంపిక బాధ్యతను ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులకు నాబార్డు అప్పగించింది. రాష్ట్రస్థాయిలో రాజకీయ జోక్యంతో ఈ ఎంపిక పూర్తయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన సీఈవో మదన్‌మోహన్‌కు కూడా అప్పట్లో మూడేళ్లు పొడిగిస్తూ డీసీసీబీ పాలకవర్గం నిర్ణయం తీసుకోవడంపై సంబంధిత శాఖ అధికారులు, ఉద్యోగుల నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. పాలకవర్గం మాత్రం మదన్‌మోహన్‌కు పాలనా విషయంలో అనుభవం ఉండటంతో ఆయన పదవీకాలాన్ని పొడిగించి కొనసాగించారు. ఆయన పదవి ముగిసే సమయంలో అనారోగ్యానికి గురికావడం, స్వయంగా సెలవులు పెట్టి వెళ్లడం జరిగింది. దీంతో సీఈవో పోస్టు భర్తీ అనివార్యమైంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని పలు శాఖల్లో సీనియర్ అధికారులు ఉన్నారు. వారందరినీ కాదని కొత్తగా ఇతర బ్యాంకునకు చెందిన రిటైర్డ్ అధికారికి బాధ్యతలు అప్పగించేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గం సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం వివిధ వాణిజ్య బ్యాంకులతోపాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో సీనియర్స్ ఉండగా, రిటైర్డ్ అధికారికి ఎలా ఇస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. అయితే నాబార్డ్ అధికారులు మాత్రం అనుభవ ప్రాతిపదికన రిటైర్డ్ అధికారిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయన్న వాదన వినిపిస్తున్నట్లు సమాచారం.

తుది నిర్ణయం కోసం నేడు ఎంసీ మీటింగ్

డీసీసీబీ పాలకవర్గ సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. సాధారణంగా జరిగే సమావేశాల మాదిరిగానే ఈసమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నారా?లేదా పలు అంశాలు ఎజెండాతో పాటు జిల్లా సహకార కేంద్రబ్యాంక్ నూతన సీఈవో ఎంపికకు సంబంధించి తుది నిర్ణయం తీసుకుంటారా? అనేది వేచి చూడాల్సి ఉంది. నాబార్డు తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని, అందులో మార్పులు చేర్పులు ఉండవని ఇంకో వాదన వినిపిస్తోంది. అయితే సహకార బ్యాంకుల్లో సీనియర్లు లేనప్పుడు మాత్రమే ఇతర బ్యాంకుల రిటైర్డ్ అధికారులను తీసుకునే అవకాశాలు ఉంటాయి.నాబార్డ్ అధికారుల బృందం అందుకు విరుద్ధంగా వ్యవహరించిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.డీసీసీబీ జీఎం,ఇన్చార్జి సీఈవో వసంతరావును ఈవిషయమై 'ఆంధ్రజ్యోతి' వివరణకోరగా,కొత్త సీఈవోను ఎంపిక చేసినట్టు తెలిసింది కానీ, ఆ వివరాలు తన వద్ద లేవన్నారు.ఎంసీ మీటింగ్ అనంతరం వివరాలను పాలకవర్గం వెల్లడించే అవకాశాలు ఉన్నాయని,సీఈవో ఎంపికపై తనకు పూర్తి సమాచారం లేదని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

▸ గత ప్రభుత్వం క్రీడలను విస్మరించింది ▸ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కాచారం గ్రామంలో రగ్బీ క్రీడల విజేతలకు బహుమతులను అందజేస్తున్న విప్

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 4: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని, గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కాచారం గ్రామంలో రగ్బీ రాష్ట్ర స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారుల్లో స్నేహభావం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపికకు కృషి చేస్తోన్న జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌ను అభినందించారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం 30 శాతం అవకాశం ఉంటుందని, దీంతో ఇప్పటివరకు ఎంతోమంది క్రీడాకారులు ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. 30 జిల్లాల నుంచి 850 మంది క్రీడారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు భోజనసౌకర్యం కల్పించిన ఎంపీటీసీ ఎడ్ల సుగుణరాంరెడ్డిని అభినందించారు. అనంతరం బాలుర విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైన ప్రథమ జట్టు జనగాం, ద్వితీయ రంగారెడ్డి, తృతీయ మహబూబ్‌నగర్, బాలికల విభాగంలో ప్రథమ మహబూబ్‌నగర్, ద్వితీయ సంగారెడ్డి, తృతీయ యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపికైనట్లు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇదిలా ఉంటే ఫిబ్రవరి నెల వేతనాన్ని రగ్బీ క్రీడాకారులకు ఇస్తానని ప్రభుత్వ విప్ తెలిపారు. కార్యక్రమంలో రగ్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీబీనగర్ లక్ష్మణ్, టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ రేగు బాలనర్సయ్య, రగ్బీ సంఘం రాష్ట్ర నాయకులు ధనంజయ్య, స్టాలిన్‌బాబు, దశరథరెడ్డి, జోసఫ్, కర్నం గణేష్, రవికుమార్,మంగళపల్లి ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, వీరేందర్ , క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్విగ్నం.. ఉద్రిక్తం

▸ విద్యార్థినుల ఆత్మహత్యతో రోదించిన కుటుంబాలు
▸ కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు
▸ పోలీసుల రంగ ప్రవేశం.. తోపులాటలో పలువురికి గాయాలు
▸ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ మళ్లించిన పోలీసులు





ఓ వైపు చిన్నారులు లేరన్న ఆవేదన. మరో వైపు వారి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్న ఆక్రందన. వెరసి ఆదివారం జిల్లాకేంద్రంలో ఉద్విగ్న.. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముక్కు పచ్చలారని ఇద్దరు చిన్నారుల ఆత్మహత్య చేసుకోవడంతో ఇటు విద్యార్థి, కుల సంఘాలు ఓవైపు, తల్లిదండ్రులు మరోవైపు ఆందోళనలకు దిగడంతో భువనగిరి అట్టుడికింది. జిల్లాకేంద్ర ఆస్పత్రితోపాటు విద్యార్థుల హాస్టల్ వద్ద పరిస్థితులు విషమించడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇందులో విద్యార్థుల బంధువులు, సంఘాల నేతలు పలువురికి గాయాలయ్యాయి. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేశారు.

- భువనగిరి టౌన్

•7లో..



యాదగిరీశా వెతలు కానవా?

▸ సేవల నిర్వహణ స్థలాల మార్పుతో కష్టాలు ▸ కొండకిందికి పలు సేవలు ▸ విష్ణుపుష్కరిణిలో స్నానాలకు తిలోదకాలు ▸ పూజా సామగ్రి దుకాణాలు కరువు ▸ ఉచిత అన్నప్రసాదాలు ఎక్కడో తెలియక ఇక్కట్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఉద్ఘాటన జరిగి రెండేళ్లు కావొస్తున్నా మొక్కు పూజల నిర్వహణకు వస్తున్న యాత్రాజనుల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తులు కుటుంబసమేతంగా ఇష్టదైవాలను దర్శించుకుని ఆర్జిత సేవల్లో పాల్గొని మొక్కు చెల్లించుకోవడం ఆనవాయితీ. అయితే ఆలయ విస్తరణ లో భాగంగా కొన్ని సేవలు కొండపైన, కొన్నింటిని కొం డ కిందికి మార్చారు. దీంతో ఏ సేవ ఎక్కడ అందుబాటులో ఉంటుందో తెలియక, చెప్పే నాథుడు లేక, కనీసం సూచీ బోర్డులు లేక అధికారుల తీరుపై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపై మూడు నిద్రల మొక్కుతో పాటు మండల దీక్ష సైతం చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా మెట్టదారిలో వచ్చే భక్తుల ఇక్కట్లు మరింతగా ఉన్నాయి. ఆలయ విస్తరణను స్వాగతిస్తున్న భక్తులు ఆర్జిత సేవల నిర్వహణ స్థలాల మార్పుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- యాదగిరిగుట్ట

ప్రధానాలయ ఉద్ఘాటనకు ముందు కొండమీదే యాత్రికులకు సకల సదుపాయాలు ఉండేవి. స్వామి సన్నిధికి కుటుంబసమేతంగా వస్తున్న భక్తులకు ఆర్జిత సేవల నిర్వహణకు తగిన సదుపాయాలు ఉండేవి. బస చేసేందుకు కొండపైన, కొండకింద దేవస్థాన వసతి గదుల సదుపాయం, స్వామి సన్నిధిలో నిత్య పూజాకైంకర్యాలు, శాశ్వత పూజల వివరాలతో పాటు అన్ని కైంకర్యాల వివరాలు తెలియజేసేందుకు విచారణశాఖ కొండపైనే ఉండేది. సత్యనారాయణస్వామి వ్రతపూజల నిర్వహణ, మొక్కు తలనీలాల సమర్పణకు కల్యాణకట్ట, విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సౌకర్యాలు ఉండేవి. ప్రధానాలయానికి ఆగ్నేయదిశలో స్వామికి నిత్య నివేదనలు తయారు చేసే రామానుజకూటమి(స్వామికి నివేదనలు తయారు చేసే వంటశాల)తో పాటు భక్తులకు విక్రయించే లడ్డూ, పులిహోర, వడ ప్రసాదాల తయారీ వంటశాల, విక్రయశాల కౌంటర్లు ఉండేవి. దేవస్థాన నిర్వహణలోని సంస్కృత విద్యాపీఠం కళాశాల, విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉండేవి. రామలింగేశ్వరస్వామికి నివేదనలు జరిపేందుకు బ్రాహ్మణ అన్న సత్రం, నిత్యం వేలాదిగా వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాల వితరణ తదితర ఏర్పాట్లు కొండపైనే ఉండేవి. దీంతో యాదగిరిక్షేత్రాన్ని వచ్చే భక్తులు కొండపైనే ఉండి మొత్తం సమయాన్ని స్వామి సన్నిధిలోనే గడిపేవారు.

కొండ కిందికి తరలిన సేవలు

యాదాద్రి ఆలయ ఉద్ఘాటన అనంతరం కొన్ని ఆర్జిత సేవలను కొండ కిందికి తరలించారు. అందుకు గండిచెరువు సమీపంలో నూతనంగా భవనాలు నిర్మించారు. కొండపైన కేవలం స్వామివారి దర్శనాలు, మొక్కు పూజల్లో స్వామివారి నిత్య, మొక్కు కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహహోమం, సువర్ణ పుష్పార్చనలు, నిజాభిషేకం, సహస్రనామార్చన కైంకర్యాలు నిర్వహించే సదుపాయాలు కల్పించారు. స్వామి వారికి జరిగే కైంకర్యాలు మినహా మిగిలిన అన్ని సదుపాయాలు కొండ కిందికి మార్చారు. మొక్కుతలనీలాల సమర్పణకు కల్యాణకట్ట, పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి, ఉచిత అన్నప్రసాదాల భవనం, సత్యనారాయణస్వామి వ్రత మండపాలతో పాటు మండల దీక్షలు చేపట్టే భక్తులకు కొండకింద గండి చెరువు సమీపంలోనే దీక్షా పరుల మండపాన్ని నిర్మించారు.

గతంలో సులువుగా స్వామి దర్శనాలు.. సేవల నిర్వహణ

ఆలయ పునర్నిర్మాణానికి ముందు భక్తులు సులువుగా దేవదేవుడి దర్శనాలు, ఆర్జిత సేవల్లో పాల్గొనేవారు. కొండగుహలో కొలువుదీరిన స్వయంభువుల దర్శనాల కోసం ఆలయాన్ని ఆనుకుని ఉన్న కాంప్లెక్స్‌ల్లో ఉచిత, ప్రత్యేక దర్శనాల క్యూలైన్ల సౌకర్యం ఉంది. ఉభయ దర్శనాల క్యూలైన్ల నుంచి ప్రధానాలయంలోనికి వచ్చిన భక్తులు ముందుగా క్షేత్రపాలకుడు ఆంజనేస్వామిని దర్శించుకుని ధ్వజస్తంభం, బలిపీఠానికి మొక్కుతూ ప్రధానాలయంలోనికి వెళ్లే వారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణోత్సవం, సుదర్శన నారసింహహోమంతో పాటు విశేష మహోత్సవాల్లో పాల్గొనేవారు. దర్శనానంతరం స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసిన భక్తులు కొండపైన, కింద వారివారి వసతి గృహాల్లో పిల్లా పాపలతో గడిపే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం ఆ సౌకర్యాలు లేవు. స్వామి వారి కైంకర్యాల కోసం కొండపైకి, ఇతర కార్యాలకు కొండ కిందికి రావాల్సి వస్తోంది. ఫలితంగా స్వామి సన్నిధిలో ఎక్కువ సమయం గడిపే అవకాశం భక్తులకు లేకుండా పోయింది.

స్వయంభువుల దర్శనం కల్పించాలి: పుష్పగిరి, భక్తుడు

స్వామి దర్శనానికి వస్తే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. యాదగిరీశుడు మా ఇలవేల్పు దైవం. మా ముత్తాతల కాలం నుంచి స్వామిని దర్శించుకుని ప్రతీ పనిని ఆరంభించడం మా ఆచారం. ఉద్ఘాటన అనంతరం స్వయంభువుల దర్శనానికి వ్యయాసలు ఎదుర్కొంటున్నాం. గతంలో మాదిరిగా స్వయంభువుల దర్శనాలు కల్పించాలి. వృద్ధులు, మహిళలు స్వామిని దర్శించుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు.



కొండపైన విష్ణుపుష్కరిణి (ఫైల్)

విష్ణుపుష్కరిణిలో స్నానాలు

కొండపైన విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలకు ఆలయ విస్తరణ తరువాత తిలోదకాలు ఇచ్చారు. పుష్కరిణిని నీటి చుక్క లేకుండా ఎండబెడుతున్నారు. కొండపైన ఈశాన్య దిశలో సహజసిద్ధంగా వెలిసిన విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే సకల రోగాలు, పాపాల నుంచి విముక్తి పొందుతారని స్థల పురాణం చెబుతోంది. గతంలో భక్తులు కల్యాణకట్టలో మొక్కు తలనీలాలు సమర్పించి విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి ఇష్టదైవాల దర్శనాలు, ఆర్జిత సేవల నిర్వహణ కోసం వెళ్లేవారు. స్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో విష్ణుపుష్కరిణిలో చక్ర తీర్థ స్నాన ఘట్టాలకు అత్యంత విశిష్టత ఉండేది. ఆయితే ఆలయ విస్తరణలో భాగంగా కొండ కింద లక్ష్మీపుష్కరిణి నిర్మాణంతో ఆ వేడుక కళ తప్పిందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత అన్నప్రసాదాలకు ఇక్కట్లు



శ్రీచక్ర కాంప్లెక్స్‌లో ఉచిత అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు(ఫైల్)

భక్తులు ఇష్టదైవాల దర్శనం అనంతరం స్వామి చెంత ఉచిత అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరుకుంటారు. ఆలయ విస్తరణ తరువాత ఉచిత అన్నప్రసాదానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు ఐదు, ఆరు దశాబ్దాల క్రితం నుంచి ఉచిత అన్నప్రసాదాల వితరణను దేవస్థానం నిర్వహిస్తూ వచ్చింది. తొలి నాళ్లలో 50మందితో ఆరంభమై సుమారు 500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించే వరకు చేరింది. ప్రతీ రోజు 500 మంది భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ టికెట్లు పంపిణీతో పాటు నిత్య, శాశ్వత తిరుకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవ ఆర్జిత సేవా కైంకర్యం టికెట్ పొందిన భక్తులు ఐదుగురికి ఉచితంగా అన్న ప్రసాదాలు అందజేసేవారు. భక్తుల నుంచి సేకరించిన విరాళాల ద్వారా వచ్చిన వడ్డీతోనే ఈ వితరణ కార్యక్రమం కొనసాగుతోంది. గతంలో ఇది కొండపైన సాగడంతో భక్తులు దీన్ని వినియోగించుకున్నారు. ఆలయ విస్తరణ అనంతరం భక్తులకు అన్నప్రసాదాలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. అన్నప్రసాద వితరణ నిర్వహించే స్థలాన్ని దూరంగా కొండకింద గండిచెరువు వద్దకు మార్పు చేశారు. దీంతో కొండపైన ఆలయ సన్నిధిలో కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవ సేవల్లో పాల్గొనే భక్తులతో పాటు క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులు సైతం ఈ సేవను పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

సేద తీరేందుకు సౌకర్యాలు

గతంలో భక్తులు కొండకింద వైకుంఠ ద్వారం వద్ద గాలిగోపురానికి మొక్కు టెంకాయ సమర్పించి కొండపైకి నడకదారి, ఘాటురోడ్డు, బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో చేరుకుంటారు. కొండపైన వివిధ సేవలు, ఇష్టదైవాల దర్శనాల అనంతరం కొండకిందే ఉన్న మరో మెట్లదారి వద్ద నిజపాదాలను దర్శించుకుంటారు. కొండకింద తులసీకాటేజ్, పాతగోశాల, పాతగుట్ట ఆలయం తదితర ప్రాంతాల్లో పిల్లాపాపలతో సేదతీరి వంటావార్పు చేసుకునేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలను యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ తన ఆధీనంలోని తీసుకోవడంతో భక్తులు అటు కొండపైన, ఇటు కొండకింద సేద తీరే ప్రాంతాలు కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మొక్కుటెంకాయలు కొనుగోలు చేస్తున్న భక్తులు (ఫైల్)

పూజా సామగ్రి కోసం వెతుకులాట

కొండపైకి వచ్చే భక్తులు ప్రస్తుతం పూజా సామగ్రి కోసం వెతులాడాల్సి వస్తోంది. కొండపై కొబ్బరికాయల దుకాణాలు తప్ప పసుపు,కుంకుమలతో పాటు తదితర మొక్కుపూజలకు సంబంధించిన పూజా ద్రవ్యాలు, నిత్యావసర సరకుల దుకాణాలు లేవు. దీంతో పూజా సామగ్రి వెంట తీసుకురాని భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పూజా సామగ్రితో పాటు అన్ని సరుకులు కొండపైనే దొరికేవి. భక్తుల కోసం హోటళ్లు, స్వీట్‌షాప్‌లు, కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్న మధుర జ్ఞాపకాలను భద్రపరుచుకునేందుకు ఫోటో స్టుడియో అందుబాటులో ఉండేవి. కొండపైనే బ్యాంకు, ఏటీఎం, డార్మెటరీ హాల్ తదితర సదుపాయాలు ఉండేవి. ప్రస్తుతం ఆ సౌకర్యాలు లేక భక్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నేడు నల్లగొండ మునిసిపల్ చైర్మన్ ఎన్నిక

ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు

రామగిరి, ఫిబ్రవరి 4: నల్లగొండ మునిసిపల్ చైర్మన్ ఎన్నికను అధికారులు సోమవారం నిర్వహించనున్నారు. 2018లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 20 స్థానాల్లో గెలిచిన బీఆర్ఎస్ ఎక్స్ అఫీషియోతో కలుపుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మునిసిపల్ చైర్మన్‌గా మందడి సైదిరెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం పెరిగి బీఆర్ఎస్ బలం తగ్గడంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి నెగ్గింది. మునిసిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న అబ్బగోని రమేష్ తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే 2018లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో నల్లగొండ మునిసిపాలిటీలో 48 వార్డులకు గాను 20 బీఆర్ఎస్, 20 కాంగ్రెస్, 6 బీజేపీ, 1 ఎంఐఎం, 1 స్వతంత్రులు గెలిచారు. మారిన సమీకరణాల నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 37కు చేరగా, బీఆర్ఎస్‌కి 5, బీజేపీకి 5, తటస్థంగా ఒక కౌన్సిలర్ ఉన్నారు. కాంగ్రెస్‌కు బలం 37గా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులు ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నిక లాంచనప్రాయం కానుంది.

బుద్ధవనాన్ని సందర్శించిన అటవీశాఖ కన్జర్వేటర్



నాగార్జునసాగర్‌లో బుద్ధుడి పాదాలకు నమస్కరిస్తున్న అటవీశాఖ యాదాద్రి సర్కిల్ కన్జర్వేటర్ శివాని డోగ్రా

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 4: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని అటవీశాఖ యాదాద్రి సర్కిల్ కన్జర్వేటర్ శివానీ డోగ్రా ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. తొలుత నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించాక, ఇటీవల నూతనంగా ప్రారంభించిన అటవీశాఖ సఫారీ వాహనంలో అర్బన్ పార్కును, నెల్లికల్ అటవీ వ్యూపాయింట్‌ను సందర్శించారు. బుద్ధవనంలో బుద్ధ చరిత వనం, గౌతమబుద్ధుడి పాదాల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతకవనం, స్థూపవనం, ధ్యానవనాలను సందర్శించి మహాస్థూపంలోని అంతర్భాగంలో ఉన్న ధ్యానమందిరాన్ని వీక్షించారు. ఇక్కడ ఇటీవల ఏర్పాటు చేసిన గౌతమబుద్ధుడి, అతని అనుచరుల అవశేశాలు కలిగి ఉన్న పగోడాను పరిశీలించారు. వారికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ ఇక్కడి విశేషాలను వివరించారు. ఆమె వెంట నాగార్జునసాగర్ అటవీశాఖ డివిజన్ పరిధిలోని అధికారులు, బుద్ధవనం సూపర్‌వైజర్ విష్ణు ఉన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

టప్రా రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 4: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్ అధ్యక్షతన జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి నూతన పీఆర్సీని అమలు చేస్తూ 30 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని, ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస వేతనం రూ.9వేలకు తగ్గకుండా చూడాలన్నారు. ఏకమొత్తంలో ఎరియర్స్‌ను చెల్లించాలని, మెడికల్ అలవెన్సును రూ.600 నుంచి రూ.200 లకు పెంచాలన్నారు. యాక్ట్ 1, 37ని రద్దుచేయాలని, ఈహెచ్ఎస్ కింద అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్పెషలిస్టులతో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. క్యాష్ లెస్ ట్రీట్మెంట్ చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, వాయిదాలు లేని చెల్లింపులు చేయాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. పెన్షనర్లకు పక్క రాష్ట్రాలు ఇస్తున్న మాదిరిగా బస్సు చార్జీల్లో రాయితీ ప్రకటించాలని, పెన్షనర్లకు ఆదాయపన్ను రద్దు చేయాలన్నారు. గతంలో ఉన్న రైల్వే చార్జీల్లో రాయితీలను తిరిగి కొనసాగించాలని, రూ.398 వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ మాట్లాడుతూ, పెన్షనర్లకు ప్రతీనెల 1వ తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు వి.బంగారయ్య, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పరిపూర్ణాచారి, కుకుడాల గోవర్ధన్, ఎండి.అబ్దుల్ ఖాదర్, వాడపల్లి రమేష్, వనం వాణిశ్రీ, కుంభం సత్తిరెడ్డి, గుండాల భిక్షమయ్య, వై.సత్తయ్య, కె.వెంకట్‌రెడ్డి, కోడి మల్లయ్య, టి.కౌసల్య, సిహెచ్.భిక్షమయ్య, పుణ్యమూర్తి లింగయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారు నమోదు చేసుకోవాలి



వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం సంబంధించి ఓటరు నమోదుకోసం ఫాం-18 దాఖలు చివరి తేదీ ఫిబ్రవరి 6తో ముగుస్తుంది. జిల్లాలో నవంబరు 2020 నాటికి మూడేళ్ల ముందుగా డిగ్రీ పూర్తయి, అర్హత ఉన్న వారందరూ కూడా సకాలంలో ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటరుగా నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు నమోదుపై సంబంధిత శాఖలతో విస్తృతంగా ప్రచారం చేపడుతున్నాం.

హనుమంతు కె.జెండగే, కలెక్టర్, యాదాద్రి భువనగిరి

పట్టభద్ర ఓటర్లపై నజర్

● రేపటితో ఫాం.18 దాఖలుకు ముగుస్తున్న గడువు ● జిల్లాలో ఇప్పటివరకు 24వేలకు పైగా ఓటర్లుగా నమోదు ● మరో 10వేల మంది పట్టభద్రులు ఉంటారని అంచనా ● ఏప్రిల్ 4న తుదిజాబితా

యాదాద్రి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియ జిల్లా యంత్రాంగం వేగవంతం చేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందిన విషయం విధితమే. అయితే ఆయన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొనసాగారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి 2024 జూన్ 8లోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఎన్నిక నిర్వహణపై ప్రక్రియను ప్రారంభించింది. 2023 నవంబరు 1వ తేదీని కటాఫ్‌గా నిర్ణయిస్తూ కొత్త ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఈసీ షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబరు 1వ తేదీ కంటే ముందు పట్టభద్రులుగా ఉన్నవారు ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదుకు ఫాం-18 దాఖలు చేసేందుకు ఈ నెల 6వ తేదీ తుది గడువు. మొదటి జాబితాలో ఓటరుగా నమోదు కోసం రేపు ఒక్కరోజు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల్లో 34వేల మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం దాదాపు 24వేలకు పైగా ఓటర్లు నమోదు చేసుకున్నారు. మరో 10వేల మంది ఓటర్లు నమోదు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, ఓటరు నమోదుపై ప్రచారం చేపడుతోంది. మరోవైపు ఇప్పటివరకు ఏ పార్టీ కూడా అభ్యర్థులను ప్రకటించలేదు. ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన పక్షంలో ఓటరు నమోదు పెరిగే అవకాశం ఉంటుంది.



తుది జాబితా ఏప్రిల్ 4న

ఓటు నమోదు కోసం తేదీ 1-11-2023 నాటికి మూడేళ్ల ముందుగా డిగ్రీ పూర్తయిన వారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరి 24వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఆ జాబితా ప్రకారం పట్టభద్రులు ఓటుహక్కును ఆయా నియోజకవర్గాల్లో వినియోగించుకోనున్నారు.

ఎపిక్ తప్పనిసరితో..

పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదు కోసం గతంలో మాదిరి కాకుండా ఈ సారి ఎన్నికల సంఘం ఎపిక్ కార్డును తప్పనిసరిగా చేసింది. ఎపిక్ కార్డు ఉంటేనే ఓటరు నమోదు చేసుకునేందుకు వీలుంటుంది. ఓటరు గుర్తింపు కార్డు ఏనియోజకవర్గానికి సంబంధించి ఉంటే... అదే నియోజకవర్గంలో ఓటు నమోదు చేసుకోవాలి. ఎపిక్ కార్డుతోపాటు ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికేట్ జీరాక్స్ జత చేయాలి. ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, డిజిగ్నేటెడ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. జిల్లాకు చెందిన పట్టభద్రులు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలోని పలు నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు చేసుకున్నారు. వీరంతా కూడా స్థానికులే అయినప్పటికీ... ఎపిక్‌కార్డు వేరే నియోజకవర్గంలో ఉండటంతో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే ఓటు నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఎపిక్ కార్డు తప్పనసరితో జిల్లాలో ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

ఉద్విగ్నం.. ఉద్రిక్తం

- రోజంతా ఆందోళనలు, నిరసనలు
- తల్లడిల్లిన భవ్యశ్రీ, వైష్ణవి కుటుంబాలు
- ఐదుగురిపై మృతుల తల్లిదండ్రులు ఫిర్యాదు

విద్యార్థి సంఘాల ఆందోళనలు, తల్లిదండ్రుల రోదనల నడుమ జిల్లాకేంద్రం భువనగిరి ఆదివారం అట్టుడికింది. తమ చిన్నారుల ఆత్మహత్యలకు కారణమైన బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు మిన్నంటాయి. విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.


హాస్టల్ వద్ద విలపిస్తున్న విద్యార్థినులు


హాస్టల్‌లో విచారణ చేస్తున్న పోలీసులు


భవ్యశ్రీ, వైష్ణవి (ఫైల్)


విద్యార్థిని మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం భువనగిరిలోని బంజారాహిల్స్ కాలనీలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులు కోడి భవ్యశ్రీ(15), గాదె వైష్ణవి(15) శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ పలు సంఘాల ఆధ్వర్యంలో హాస్టల్, జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ఆదివారం 10గంటల పాటు ఆందోళన కొనసాగింది. దీంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భవ్యశ్రీ, వైష్ణవి గత కొన్నేళ్లుగా ఎస్సీ వసతిగృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. 15 రోజుల క్రితం అదే హాస్టల్‌కు చెందిన కొంతమంది బాలికలతో ఏర్పడిన వివాదంపై పాఠశాల పీఈటీ, హాస్టల్ వార్డెన్ శనివారం ఉదయం కౌన్సెలింగ్ చేశారు. దీంతో అదేరోజు రాత్రి హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలకు దారి తీసింది. శనివారం రాత్రి జరిగిన ఘటనపై ఇచ్చిన సమాచారంతో మృతుల కుటుంబసభ్యులు అర్ధరాత్రి దాటాక జిల్లా ఆస్పత్రికి చేరుకొని మృతదేహాలను చూస్తూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అయితే సంచలనంగా మారిన విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేస్తున్న క్రమంలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ జిల్లాకేంద్ర ఆస్పత్రి ఎదుట బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎంతోపాటు పలు సంఘాల కార్యకర్తలు గంటల తరబడి ధర్నా చేశారు.


హాస్టల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు


ఆస్పత్రి ఎదుట రోదిస్తున్న భవ్యశ్రీ కుటుంబ సభ్యులు

బాధిత కుటుంబాలకు రూ.50వేల ఆర్థికసాయం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల చొప్పున నగదు సాయాన్ని అందజేశారు. ఆత్మహత్యకు కారణాలపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఆత్మహత్య కారకులపై కేసులు నమోదు చేసి బాలికల కుటుంబాలకు న్యాయం చేస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీవో అమరేందర్, తహసీల్దార్ అంజిరెడ్డి, ఇచ్చిన హామీలతో ఆందోళనకారులు ధర్నాను విరమించారు. ఇదిలా ఉంటే హాస్టల్‌ను క్లూస్‌టీం సందర్శించి ఆధారాలు సేకరించింది. జిల్లాకేంద్ర ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జిల్లా ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళనకారులు బైఠాయించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించారు.

రోజంతా ఆందోళనలే...

భవ్య శ్రీ, వైష్ణవి ఆత్మహత్యలతో ఆదివారం రోజంతా భువనగిరిలో ఆందోళనలు కొనసాగాయి. బీజేపీ, సీపీఎం, బీఆర్ఎస్, బీసీ, యాదవ, రజక, విద్యార్థిసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాస్టల్, మృతదేహాలను భద్రపరిచిన జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళనలు కొనసాగించారు. విద్యార్థినుల ఆత్మహత్యలకు కారకులైన నిందితులను శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, ఏబీవీపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ సుర్వి మణికంఠ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాం దేవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నర్సింహస్వామి, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రాంచంద్రయ్య తదితరులు డిమాండ్ చేశారు. జాతీయరహదారిపై రాస్తారోకోకు ప్రయత్నించిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డితోపాటు కార్యకర్తలను, మృతుల కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేస్తున్న క్రమంలో ఆందోళనకారులు, కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. కాగా హాస్టల్‌లో జరిగిన జంట ఆత్మహత్యలు, కొనసాగుతున్న ఆందోళనలతో విద్యార్థినులు హాస్టల్ వీడారు. వివిధ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్ నుంచి తీసుకెళ్లారు.

ఆత్మహత్యలపై అనుమానాలెన్నో..

భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 15 రోజుల క్రితం తలెత్తిన వివాదంపై శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇద్దరితో ఘర్షణ పడిన ఇతర బాలికలు ఇచ్చిన ఫిర్యాదులపై వార్డెన్ శైలజ, పీఈటీ ప్రతిభ కౌన్సిలింగ్ చేసిన గంటల వ్యవధిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం వెనుక ఇతర కారణాలు ఉన్నాయని కుటుంబసభ్యులు, ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. సుమారు 100 మంది బాలికలు ఉండే వసతి గృహంలో నైట్ వాచ్‌మెన్ లేరని, వంట నిర్వహణ సిబ్బందికోసం ఆటో డ్రైవర్లు అర్ధరాత్రి హాస్టల్‌లోకి వచ్చేవారని వారి అసభ్య ప్రవర్తనలపై భవ్యశ్రీ, వైష్ణవితో పాటు పలువురు విద్యార్థినులు ఫిర్యాదులు చేసినప్పటికీ వార్డెన్ స్పందించకపోవడంతోనే మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని అంటున్నారు. సమగ్ర విచారణ జరిపితేనే నిజాలు వెల్లడవుతాయని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

ఒక్కొక్కరిది.. ఒక్కో నేపథ్యం..

ఆత్మహత్య చేసుకున్న భవ్యశ్రీ, వైష్ణవి ఇద్దరు ఉమ్మడి వరంగల్ జిల్లావాసులే కావడంతో పాటు ఇరువురి తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్ హబ్సిగూడలో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ముద్రావు పేట గ్రామానికి చెందిన కోడి కృష్ణ, లలిత దంపతుల రెండో కుమార్తె భవ్యశ్రీ. ఈమె 3వ తరగతి నుంచి ఇదే హాస్టల్‌లో ఉంటూ ఇక్కడే చదువుకుంటున్నది. తల్లిదండ్రులు మాత్రం హైదరాబాద్ హబ్సిగూడలో నివాసం ఉంటుండగా తండ్రి కృష్ణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జనగామ జిల్లా చిన్నపెండ్యాల మండలం వెంకటాద్రిపేటకు చెందిన గాదె రాజు స్వతహాగా దివ్యాంగుడు. ఇతని భార్య, కొడుకు గతంలోనే మృతి చెందగా ఏకైక కూతురు వైష్ణవి నాలుగేళ్ల క్రితం నుంచి భువనగిరిలోనే చదువుకుంటున్నది. దివ్యాంగుడైన రాజు హబ్సిగూడలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

ఐదుగురిపై ఫిర్యాదు

భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యల ఘటనపై కుటుంబ సభ్యులు ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిద్దరు ఆత్మహత్య చేసుకునేంత పిరికి వారు కాదని, వారిని హింసించడంతో ప్రాణాలు కోల్పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హాస్టల్ వార్డెన్ శైలజ, హాస్టల్ ట్యూటర్ భువనేశ్వరి, బాలికల ఉన్నత పాఠశాల పీఈటీ ప్రతిభ, ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వంట సిబ్బంది సుజాతపై అనుమానాలున్నట్లు భవ్యశ్రీ తండ్రి కృష్ణ, వైష్ణవి తండ్రి రాజు ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్, ఎస్ఐ నాగరాజు తెలిపారు. విద్యార్థుల ఆత్మహత్యల కేసులో అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు భువనగిరి ఎస్ఐ నాగరాజు తెలిపారు. విద్యార్థినులు రాసినట్లుగా ప్రచారమవుతున్న సూసైడ్ నోట్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని, మృతదేహాలకు కెమికల్ టెస్టులు నిర్వహించాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఘటన


మల్లయ్య (ఫైల్)

శాలిగౌరారం ఫిబ్రవరి 4: వ్యవసాయ బోరు వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని జాలోనిగూడెం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరానికి చెందిన రైతు జోగు మల్లయ్య (48) జాలోనిగూడెం శివారులో రెండు ఎకరాలు సాగు చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన మల్లయ్య బోర్ మోటార్ నీరు పోయకపోవడంతో అక్కడ ఉన్న సర్వీస్ వైర్‌ను పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు విగతజీవిగా పడి ఉన్న మల్లయ్యను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతుడు మల్లయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు అరవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మరో ఘటనలో మహిళ..

పెన్‌పహాడ్: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వీరబోయిన ధనమ్మ (29) శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందింది. బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం... ధనమ్మ ఇంట్లో దుస్తులు ఉతికి, దండెంగా ఏర్పాటు చేసిన వైర్‌పై ఆరేయడంతో, అప్పటికే ఆ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెన్‌పహాడ్ పోలీసులు తెలిపారు.


ధనమ్మ (ఫైల్)

ట్రాక్టర్ ఢీకొని..

గుండాల, ఫిబ్రవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురంలో ఆదివారం ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ యాకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూరపాటి జానకమ్మ(60) బంధువుల ఇంటినుంచి ఆమె ఇంటికి వెళ్తుండగా బస్టాండ్ చౌరస్తాలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టడంతో కాళ్లు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు..

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 4: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని ఏనుబాముల గ్రామానికి చెందిన పసునూరి వెంకన్న (63) గత నెల 29న తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయపడ్డాడు. ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు పసునూరి అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.సైదులు తెలిపారు.

గుడిబండ గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 4: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామ పంచాయతీలో రూ.55లక్షలు దుర్వినియోగం అయ్యాయని, దీనికి బాధ్యులైన గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ లంకెల అలివేలుమంగమ్మ, ఉపసర్పంచ్ సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఈ విషయమై రెండురోజుల క్రితం సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావును కలిసి ఫిర్యాదు చేశారు. గుడిబండ గ్రామ సర్పంచ్‌గా లంకెలఅలివేలు మంగమ్మ ఎన్నికైన సమయంలో అభివృద్ధి పనులు, నిధుల మంజూరు విషయంలో గ్రామ ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ కవితల మధ్య వివాదం ఏర్పడింది. ఆ సమయంలో ఉన్న ఎంపీపీగా ఉన్న కవిత తన రాజకీయ పలుకుబడితో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేయించింది. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యతను ఉపసర్పంచ్ సంధ్యారాణికి అప్పగించారు. ఈ నిధుల మంజూరు విషయంలో ఆనాడు ఎంపీపీగా ఉన్న కవిత, ఎంపీడీవో అండదండలతో గ్రామ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనేక అవకతవకలకు పాల్పడిందని మాజీ సర్పంచ్ లంకెలఅలివేలు మంగమ్మ ఆరోపించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ సంతకాలను కూడా ఫోర్జరీ చేసి నిధులను పక్కదారి పట్టించారని, ఉపాధి హామీ పనులతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయడంలో కూడా కార్యదర్శి అవినీతికి పాల్పడిందని ఆమె ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేయాలని డీపీవోను కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు.

గ్రామంలో బెల్ట్‌షాపులు నడపొద్దు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 4: గ్రామంలో బెల్ట్‌షాపులు నడపొద్దని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బస్వాపూర్ గ్రామ యువకులు తీర్మానించారు. గ్రామంలో ఆదివారం వారు సమావేశమై బెల్ట్ షాపుల నివారణకు యువకులు, మహిళా సంఘాలు, గ్రామస్థులు సమష్టిగా ముందుకు రావాలని కోరారు. గ్రామంలో ఉన్న సుమారు 15 బెల్ట్ షాపులను ఏడు రోజుల్లో మూసేయాలని తీర్మానించారు. వారం రోజుల తర్వాత బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే కలెక్టర్, ఎక్సైజ్, పోలీసు అధికారులకు సమస్యను వివరించాలని తీర్మానించారు. సమావేశంలో గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు ఉడుత రాములు, వెంకటేశం, వెంకట నర్సయ్య, కస్తూరి పాండు, వెంకటేష్ పాల్గొన్నారు.


తీర్మాన ప్రతి చూపిస్తున్న గ్రామ యువకులు

లక్ష్మీనృసింహుడికి నిత్యపూజలు


నిత్యతిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వయంభూ పాంచనారసింహుడికి నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆదివారం వేకువజామున సుప్రభాతంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కొండపైన శివాలయంలో రామ లింగేశ్వరుడికి నిత్య పూజలు, నిత్య రుద్రహవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రత పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. వారాంతపు సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రాజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాలతో పాటు ఆలయ తిరువీధులు భక్తుల సంచారంతో సందడిగా కనిపించాయి. 35వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.45,01,535ల ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకళ

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 4: మెప్మా రీసోర్స్ పర్సన్ల సమస్యలు సమస్యలు పరిష్కరించాలని ఆ సం ఘం రాష్ట్ర అధ్యక్షురాలు జాజుల చంద్రకళ కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మెప్మా విభాగంతోపాటు ప్రభుత్వ పథకాల అమలులో సేవలందిస్తున్న తమకు కనీస వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు సరైన గుర్తింపు లేదన్నారు. ప్రస్తుతం ఉన్న గౌరవ వేతనాన్ని సకాలంలో అందించాలని కోరారు. రీసోర్స్ పర్సన్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్యబీమా అందించాలని, కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు లక్ష్మీప్రసన్న, సుజాత, రజని, పద్మ, లీలా, విజ య, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, సుధ, సౌజన్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఫల్యాలపై చార్జిషీట్ వేయాలి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 4: కేంద్రం బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి బీజేపీ పదేళ్లయినా రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రతీ ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఎందుకు నెరవేర్చలేదో మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వామపక్షాల కృషి వల్ల వచ్చిన ఉపాధిహామీ పథకానికి కూడా తూట్లు పొడుస్తుందని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేసి బీజేపీ ప్రభుత్వం మెడలు మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా నాయకుడు జిట్ట నగేష్ అధ్యక్షతన నిర్వహించని సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి చింతపల్లి బయన్న, నాయకులు రాచకొండ శ్యాంసుందర్, నన్నేసాహెబ్, సిగారపు లక్ష్మి, చింత సునీత, గోపాల్ పాల్గొన్నారు.

గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 4: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో జరగనున్న గర్ల్స్ కన్వెన్షన్‌కు బాలికలందరూ తరలిరావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపనబోయిన నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను అడ్డుకోవాలని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన చట్టాలు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కన్వెన్షన్‌కు జాతీయ, రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, మహిళా మేధావులు హాజరుకానున్నట్లు తెలిపారు. కన్వెన్షన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బక్కా శ్రీనివాసాచారి, డాక్టర్ రాజు, మూడావత్ రవినాయక్, పాదూరి గోవర్ధన, కుర్ర సైదా, సంపత్, మణి, ప్రసన్న, కావ్య, కల్పన, రాధిక, నాగ, మాధవి పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం : లాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 4: కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే అందుకు కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. దేవరకొండలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మాజీ ఉపప్రధాని ఎల్‌కే అడ్వాణీకి భారతరత్న అవార్డు పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం మళ్లీ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

కృష్ణానీటిపై కేంద్రం పెత్తనం తగదు : సీపీఐ

చిట్యాల, ఫిబ్రవరి 4: కృష్ణా నదీ జలాలపై కేంద్రప్రభుత్వం తన పెత్తనం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్యాలలో ఆదివారం జరిగిన సీపీఐ పట్టణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జలాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్లాలని కోరారు. కేంద్రప్రభుత్వం రైతు, కూలీ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చిట్యాల మునిసిపాలిటీలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కె షరీఫ్, బొల్గూరి లింగయ్య, దేశగోని బాలరాజు, మేకల బిక్షం, కడగంచి రామలింగయ్య, దండిగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

● మృతదేహం బంధువులు, గ్రామస్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

మర్రిగూడ, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.... మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో జనవరి 24వ తేదీన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ (33) తీవ్రంగా గాయపడగా, కొట్టాల గ్రామానికి బుర్ర రాజుకు గాయాలయ్యాయి. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 12 రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. మృతుడు తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన వెంకటేష్ అకాలమృతితో కుటుంబసభ్యులు రోడ్డున పడ్డారు. ఇదిలా ఉంటే ఈ ప్రమాదానికి కొట్టాల గ్రామానికి చెందిన రాజు కారణమని పేర్కొంటూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబసభ్యులతో కలిసి రాంరెడ్డిపల్లి గ్రామస్థులు కొట్టాలలోని రాజు ఇంటి దగ్గర ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న మర్రిగూడ, గట్టుప్పల్, మండలాలకు చెందిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని తరలించాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు పోలీసులు నచ్చచెప్పారు. అయినా వారు వినకుండా మాకు న్యాయం జరిగేంత వరకు మృతదేహాన్ని ఇంటి ముందు నుంచి కదిలించేది లేదని తేల్చిచెప్పారు. రాత్రి పొద్దెపోయే వరకు ఆందోళన కొనసాగించారు. ప్రమాదానికి కారకుడైన రాజు కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పరారీలో ఉన్నారు.

విద్య అందని ద్రాక్ష కాకూడదు

హాలియా, ఫిబ్రవరి 4: విద్య అందని ద్రాక్ష కాకూడదని పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ శాంతిపాల్‌రెడ్డి, సభ్యులు వంగూరి శ్రీనివాస్ అన్నారు. హాలియాలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన నెలవారీ అభ్యాసకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గడిచిన నెలలో జరిగిన ప్రగతిపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలకు సబ్జెక్టుల్లో ప్రావీణ్యాన్ని పెంపొందించడానికి గణితం, ఆంగ్లం, మాతృభాషపై మెళకువలను నేర్పుతున్నట్లు తెలిపారు. అంతేకాక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి పేదలకు మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రొఫెసర్ యాదగిరిరెడ్డి, డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, ఐదు మండలాల కోఆర్డినేటర్లు రమేష్‌రెడ్డి, గుండెబోయిన అంజియాదవ్, మేదర్ శేఖర్, షేక్ రిజ్వాన్‌బాబా, నర్సింహ, సునీత, అభ్యాసకులు వంగూరి శ్రీనివాస్, అనుముల నాగయ్య, సతీష్, మనీషా, అఖిల, వివిధ గ్రామాల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా జాయింట్ సెక్రటరీగా నిర్మలాదేవి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 4: మహిళా కాంగ్రెస్ జిల్లా జాయింట్ సెక్రటరీగా పట్టణానికి చెందిన పసుపులేటి నిర్మలాదేవిని నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో ఆమె నిర్మలకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలాదేవి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

నిధులున్నా నిష్ఫలం


గతంలో కూరగాయల మార్కెట్‌కు కేటాయించిన స్థలం

- దేవరకొండ సమీకృత మార్కెట్‌కు స్థల సేకరణలో జాప్యం
- దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, పట్టణ ప్రజలు

దేవరకొండ, ఫిబ్రవరి 4: దేవరకొండ పట్టణంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మంజూరై నాలుగేళ్లవుతున్నా అధికారులు స్థల సేకరణ చేయకపోవడం తో మార్కెట్ పనులు ముందుకు సాగడం లేదు. సమీకృత మార్కెట్ నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. దీంతో మార్కెట్ నిర్మాణానికి నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. సమీకృత మార్కెట్‌కు రూ.4.5 కోట్ల నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా మునిసిపల్, రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేయకపోవడంతో నిధులు మూలుగుతున్నాయి. 2021లో సిల్వర్ జూబ్లీ క్లబ్ స్థలంలో రూ. 4.5కోట్ల వ్యయంతో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. నిధులు మం జూరయ్యాయి. అయితే సిల్వర్ జూబ్లీక్లబ్ స్థలం హైకోర్టులో వివాదంలో ఉండటంతో స్థలం ముందుకు సాగలేదు. దీంతో మునిసిపల్, రెవెన్యూ అధికారులు ప్రభు త్వ జూనియర్ కళాశాల స్థలంలో మార్కెట్‌కు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్‌కు నివేదిక పంపారు. విచారణ చేసిన కలెక్టర్ స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వు లు జారీ చేశారు. దీంతో కూరగాయల మార్కెట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయవద్దని విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని విద్యార్థులు, విద్యార్థుల సంఘాలు, బీజేపీ నాయకులు పనులను అడ్డుకున్నారు. హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో మరోసారి మార్కెట్ నిర్మాణ పనులు ఆగిపోయా యి. పాత కూరగాయాల మార్కెట్, గాంధీబజార్‌లో నాలుగు ఎకరాల స్థలం ఉన్నా అక్కడ మార్కెట్ ఏర్పా టు చేసేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. దేవరకొండ పాత కూరగాయాల మార్కెట్‌లో, 2018లో రూ.1.80 కోట్లతో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కానీ కాంట్రాక్టర్ జాప్యంతో ఆలస్యమైంది. దీంతో ము నిసిపల్ అధికారులు ఆ నిధులను మునిసిపల్ అభివృద్ధికి బదలాయించారు. దేవరకొండలో సమీకృత మార్కెట్ లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కూరగాయాల మార్కెట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో దేవరకొండలో మార్కెట్ ఏర్పాటు అవుతుందని ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి పాత కూరగాయాల మార్కెట్‌లోనే కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించి ఏర్పాటు చేయాలి



దేవరకొండలో సమీకృత కూరగాయాల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించి ఏర్పాటు చేయాలి. మార్కెట్ లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

- డాక్టర్ ఏకుల రాజారావు, దేవరకొండ

స్థల సేకరణ చేస్తున్నాం



దేవరకొండలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు రూ.4.5కోట్లు నిధులు మంజూరయ్యాయి. గతంలో స్థలాలు పరిశీలించినా వివాదాలు ఉండడంతో ముందుకు సాగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కెట్ స్థల సేకరణ చేసే పనుల్లో ఉన్నాం. త్వరలో మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతాం.

- వెంకటయ్య, దేవరకొండ మునిసిపల్ కమిషనర్

ప్రాజెక్టుల వద్ద రక్షణ చర్యలేవీ?

2 ప్రాజెక్టుల వద్ద మృత్యువాత పడుతున్న పర్యాటకులు


నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ కృష్ణాపరివాహక ప్రాంతం

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని ఏఎమ్మార్పీ, డిండి, పెండ్లిపాకల, కృష్ణా బ్యాక్‌వాటర్, వైజాగ్‌కాలనీ ప్రాజెక్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో పర్యాటకులు మృత్యువాత పడుతున్నారు.విహారయాత్రకు వస్తున్న పర్యాటకులకు విషాదయాత్రగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లో స్నానానికని వెళ్లి నీటమునిగి మృత్యువాతకు గురవుతున్నారు. ప్రాజెక్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో తరచూ పర్యాటకులు మృత్యువాతకు గురవుతూనే ఉన్నారు. విహారయాత్రకని ఆనందంతో వచ్చి ఈతకువెళ్లి ప్రాజెక్టుల్లోకి దిగి నీటి గుంటలో మునిగి చనిపోతున్నారు. గతేడాది డిసెంబర్ 25న నిర్మల్ జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థి ఆశిష్ స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చారు. ఆశిష్ ఈతకని కృష్ణా పరివాహక ప్రాంతంలోకి వెళ్లారు.ఈతరాకపోవడం, గుంతలో నీటమునిగి మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు తరుచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. 2014లో డిండి ప్రాజెక్టులో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు స్నానానికి ప్రాజెక్టులోకి దిగి మృత్యువాతకు గురయ్యారు. 2018లో ఐదుగురు చిన్నారులు పెండ్లిపాకల రిజర్వాయర్ గుంతలోకి దిగి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. 2018ఇద్దరు యువకులు నీటిలో పడి మృతి చెందారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని వెళ్తున్నారే తప్ప ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుల వద్ద రక్షణ ఏర్పాట్లుచేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాజెక్టుల వద్ద రక్షణ చర్యలు చేపడుతున్నాం



వైజాగ్‌కాలనీ, కృష్ణాబ్యాక్ వాట ర్ వద్దకు విహారయాత్రకు వచ్చిన వారు ఈతకని వెళ్లి మృతి చెందుతున్నారు. ప్రాజెక్టుల చుట్టూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చే శాం. పోలీస్‌శాఖ పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తుంది. పర్యాటకులు ఈతకని ప్రాజెక్టులలోకి వెళ్లవద్దు.

- గిరిబాబు, డీఎస్పీ, దేవరకొండ

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికల జట్లు

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాల్‌లోని ఏఆర్‌నగర్ మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొననున్నట్లు బయ్యన్న వెల్లడించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టులో బాలుర విభాగంలో గణేష్, సుషింత్, గౌతమ్, చిన్ని, మల్లికార్జున్, బాలికల విభాగంలో శ్వేత, అశ్విని, ఏకాంబరేశ్వరి, భవ్యశ్రీ, శృతి ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.స్వామి, టీ. శ్రీనివాస్, ఆర్.బాలు, జి. పాండు, ఎం.అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన 11న


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయకమిటీ సభ్యులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 4: జిల్లా కేంద్రంలోని పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 11వ తేదీన అత్యంత వైభవంగా 18 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భైరగోని రాజయ్య, ప్రధాన కార్యదర్శి బండారు ప్రసాద్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన 18 ఫీట్ల ఏకశిలపై చెక్కిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని మహాబలిపురం నుంచి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పవిత్రమైన నది జలాలతో వివిధ దేవాలయాల నుంచి సేకరించిన మట్టితో నల్లగొండ పట్టణంలో ఊరేగించి స్వామివారిని గుట్టపైకి తీసుకువెళ్లి జలదివాసం చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి రానున్న వేద పాఠశాలల వేదపండితులు మంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా ఈ నెల 11న ఉదయం 11.55 గంటలకు అభయాంజనేయస్వామి విగ్రహ యంత్ర ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. సుమారు రూ.5 కోట్లతో నాలుగు ఎకరాల్లో నిర్మించే ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ మహోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కారి, కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో పాటు అన్ని పార్టీల రాజకీయ నాయకులు జిల్లా స్థాయి అధికారులు వివిధ ఆలయాల చైర్మన్లు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, కంది సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, నాయకులు లక్ష్మణరావు, రావిరాల వెంకటేశ్వర్లు, యాదగిరిచారి, కాశమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : శ్యాంసుందర్‌రావు

నకిరేకల్, ఫిబ్రవరి 4: భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పల్లెపల్లెకు వెళ్లి స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని యాదాద్రిభువనగిరి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షు డు పీవీ శ్యామ్‌సుందర్‌రావు అన్నారు. నకిరేకల్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో విజన్ 2024తో ప్రతీ పల్లెకు వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పార్టీలకతీతంగా చర్చా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో విజన్ చర్చ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల ద్వారా సమస్యలు తెలుసుకుని ప రిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈనెల 6వ తేదీన నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్స్‌లో జరిగే చర్చా వేదిక సమావేశంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఐదేళ్ల క్రితం మూసీ ప్రాజెక్టు ప్రక్షాళన కోసం 108 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు దాసరి మల్లేశం, రవీందర్, ప్రభాకర్‌రావు, మండల వెంకన్న, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా హనుమంతు

పెద్దవూర, ఫిబ్రవరి 4: యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన నల్లా హనుమంతు ఎన్నికయ్యారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ఆదివారం హనుమంతుకు నియామకపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మేకల శ్రీకాంత్, కార్యదర్శిగా రమావత్ బాలునాయక్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జానారెడ్డికి, కర్నాటి లింగారెడ్డికి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు యాదవ్, నాయకులు తుమ్మలపల్లి రంగారెడ్డి, పాండునాయక్, మునినాయక్, సుధాకర్‌రెడ్డి, గిరిబాబు, శశిపాల్‌రెడ్డి, బిక్షం, తిరుమలయాదవ్, అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

శ్యామలాదేవి అలంకరణలో రేణుకా ఎల్లమ్మ


శ్యామలాదేవి అలంకరణలో ఎల్లమ్మ

కనగల్, ఫిబ్రవరి 4: మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుకాఎల్లమ్మ తల్లి ఆదివారం శ్యామలాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. చీర సారె ఒడి బియ్యంతో పాటు బోనవైవేద్యాలను సమర్పించుకున్నారు. పుట్టలో పాలు పోసి నాగపడిగలకు మొ క్కుకున్నారు. కోర్కెలు నెరవేరాలని ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగుఏర్పాట్లు చేశారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌టీచారి

నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 4: శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌టీచారి, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్ కోరారు. జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు జిల్లా నుంచి శ్రీవైష్ణవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, అందుకు కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. కమిటీలో అన్ని దేవాలయాల నుంచి బ్రాహ్మణులను, వైష్ణవులకు స్థానం కల్పించాలని జిల్లా వైష్ణవ సంఘం నాయకులు కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుమోహన్, సలహాదారుడు రత్నామాచార్యులు, జిల్లా కార్యదర్శి వేదాంతం శ్రీనివాసాచార్యులు, సభ్యులు పి.భాస్కర్, జనార్ధనాచార్యులు, రామకృష్ణ, శఠగోపాలాచార్యులు, యాదగిరాచార్యులు, కృష్ణామాచార్యులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

● ఎమ్మెల్యే బీఎల్ఆర్ చొరవతో మేజర్లకు నీరు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 4: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవతో సాగర్ పరిధిలోని పలు మేజర్లకు ఆదివారం నీటి విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు సాగు, తాగు నీటిఎద్దడి పరిస్థితిని మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డికి తెలియజేసి పరిస్థితిని వివరించారు. అంతేకాక ఎన్నెస్పీ ఉన్నతాధికారులను కలిసిన ఎమ్మెల్యే నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు స్పందించిన అధికారులు నీటిని విడుదల చేయగా తాగు, సాగు నీటి ఎద్దడి తీరింది. కాగా నీటి విడుదల మరో మూడు, నాలుగు రోజులు కొనసాగనుంది.

సంక్షిప్త సమాచారం...

తిరుమలగిరి(సాగర్): మండలంలోని శిల్గాపూర్ గ్రామంలో అల్విన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ అభయ్ ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బహదూర్‌షా మాట్లాడుతూ ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాత్స వ్, భూక్యా సాయికుమార్, ఫౌండేషన్ సభ్యులు నరేష్, హైమద్, స్వామి, జాకీర్, జానకీరాం పాల్గొన్నారు.

చింతపల్లి: ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం పట్టభద్రులందరూ ఫారం 18లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ. శంషుద్దీన్ అన్నారు. ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: చైతన్య జనసేవా సంఘం దివ్యాంగ విభాగ చార్టర్ సభ్యుడు కోల సైదులు సేవలు ఆదర్శనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పాటి హిల్ అన్నారు. జనసేవ సంఘంతో పాటు లయన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవలందిస్తున్న కోల సైదులును క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంగవైకల్యాన్ని పక్కన పెట్టి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సైదులు ఇతర సభ్యులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏచూరి భాగ్యలక్ష్మి, సింగు రాంబాబు, మురహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● లాల్‌కృష్ణ అడ్వాణీకి భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ, బీసీ, ఆప్ విభాగాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పోగుల సైదులుగౌడ్, కీర్తి అశోక్, తల్లం అశోక్ మాట్లాడుతూ దేశభక్తి, అంకితభావంతో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించిన అడ్వాణీ భారతరత్న అందుకోవడం హర్షనీయమన్నారు. పార్టీలకతీతంగా హర్షించాల్సిన విషయమన్నారు.

మిర్యాలగూడ టౌన్: కులగణనను అడ్డుకోవడం ఎంతమాత్రం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. కుల గణన విదేశీ శక్తుల ఎజెండా అని మాజీ డీజీపీ అరవిందరావు పేర్కొనడం మూర్ఖత్వమన్నారు. కులగణనతో ఆర్థిక స్థితిగతులు అధ్యయనంతో పాటు రిజర్వేషన్ల అమలులో లోపాలు సవరించవచ్చని అన్నారు. బీసీ వ్యతిరేక శక్తులు కులగణనను అడ్డుకోవడం పరిపాటిగా మారిందన్నారు.

మాడ్గులపల్లి: వరదకాల్వకు నీటి విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. సాగర్ నీటిని వరదకాల్వ ద్వారా చెరువుల ను నింపితే భూగర్భజలాలు వృద్ధి చెంది పంటలను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సాగర్ నీటిని వరద కాల్వ ద్వారా ఎండుతున్న పంటలను కాపాడాలని అన్నారు.

నకిరేకల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకే అనుకూలంగా ఉందని రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాళ ప్రమీల విమర్శించారు. నకిరేకల్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు.

మునుగోడురూరల్: నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన మేకల ప్రమోద్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియమించారు.

ఉపాధి కోసం వెళ్తూ...

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రశాంత్ మృతదేహం

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 4: ఉపాధి కోసం వెళ్తున్న ఓ యువకుడు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం జరిగింది. చిట్యాల ఎస్ఐ-2 నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన గూడపూరి ప్రశాంత్ (28) వ్యవసాయం చేస్తున్నాడు. అంతేకాక తనకు వచ్చిన డ్రైవింగ్‌లో ఉద్యోగం వెతుక్కునేందుకు ఏపీ 29 బీప 4700 నంబరు గల ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ సమీపంలో హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం (టీఎస్ 05 టీఎఫ్ 1591) ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రశాంత్ ఎగిరి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో డీసీఎం అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రశాంత్‌కు భార్య, ఒక ఎనిమిది నెలల కుమార్తె ఉన్నారు. ప్రశాంత్ తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి

● ఆలివ్ డెంటల్ వరల్డ్‌ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి వెంకట్‌రెడ్డి, దిల్‌రాజు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 4: అత్యాధునిక వైద్యసేవలను వినియోగించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జగన్ టెక్స్‌టైల్ వారిచే ఏర్పాటు చేసిన ఆలివ్ డెంటల్ వరల్డ్ ఆస్పత్రిని ఆదివారం మంత్రి వెంకట్‌రెడ్డి సినీ నిర్మాత దిల్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలు, కొత్త తరహా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిని వెంకన్న, డాక్టర్ ఆదిత్యజగిని, డాక్టర్ పూజ సాయిజగిని, డాక్టర్ అర్జున్, శ్రీనివాస్, యుగంధర్, కల్వ ఉదయ్‌కుమార్, సుధాకర్ వ్యాపారస్థులు పాల్గొన్నారు.